
# ఇన్‌లాండ్ లెటర్ కథలు

## అమ్మ మనసు

యశోద పిల్లలు అందరూ చనిపోతే చుట్టాల దగ్గర నుంచి ప్రభాకర్‌ను తీసుకొని పెంచుకొంది. చిన్నప్పటినుంచి ఎంతో గారాబంగా పెంచింది. పెద్దయిన తర్వాత అన్ని దురలవాట్లకు బానిస అయ్యాడు. ఒక అమ్మాయిని కూడా ఉంచుకొన్నాడు. ఒక రోజు ఆ అమ్మాయి " నిజంగా నీకు నా మీద ప్రేమే గనుక ఉంటే మీ అమ్మను చంపి మీ అమ్మ గుండెను తీసుకు రా!" అని ఆజ్ఞాపించింది. కామ మనే మోహంలో తనను కనకపోయినా కంటికి రెప్పలా,అల్లారు ముద్దుగా పెంచిందన్న జ్ఞానాన్ని మరచిపోయిన వాడై తాగిన మైకంలో తల్లిని చంపి ఆమె గుండెను తీసుకొని ఇల్లు దాటుతాడు. ఆ ఇంటి ఎదురుగా ఒక పశువుల శాల ఉంది. దానిపై ఒక మిద్దెఉంది. ఆ మిద్దె మీద ఎలుకలు తిరుగుతుంటాయి.చెలి కోరిక తీర్చాలన్న ఆరాటంలో ప్రభాకర్ పరుగెత్తుతూ మిద్దెకు సమీపంలో పడిపోతాడు. సరిగ్గా అదే సమయంలో మిద్దెపై తిరుగుతున్న ఎలుకలు వేగంగా తిరుగుతుండటంతో ఒక గునపం జారి కిందపడుతూ ప్రభాకర్ గుండెల్లోకి దిగుతుంది. ఆ వెంటనే అమ్మా అంటూ ప్రభాకర్ బిగ్గరగా కేక పెడతాడు. అతని కేకకు అతని పక్కనే పడివున్న తల్లి గుండె వేదనా భరితమై భగవంతుడితో "ఆ గునపం నా గుండెల్లో గుచ్చుకున్నా బాధ పడే దానిని కాదు. నా కుమారుడు ఎంత బాధ పడుతున్నాడో, ఆ ఆర్త నాదాలను నే వినలేను నా బిడ్డను రక్షించు " అని ఆవేదన చెందుతుంది.ఆ మాటలు విన్న ఆమె కుమారుడు "అయ్యో కామాంధుడినై చే జేతులా తల్లిని చంపుకొన్నాను. తల్లి మనసు ఎంత గొప్పదో కదా! తల్లిని ప్రేమించని, తల్లి మనసు గ్రహించలేని నాకి శాస్తి జరగవలసిందే " అంటూ రోదిస్తూ కన్ను మూస్తాడు.

గొర్రెల రామ్మోహనరావు,



## జింజిర్

జింజిర్ పికిల్ తెస్తానని బజారుకి వెళ్లాడు నా ఫ్రెండ్ రాజారావు. ఈ మధ్యే అతనికి టీచరు పోస్ట్ వచ్చింది. స్కూల్‌కి దగ్గర్లో వున్న రూం తీసుకూని అందులో వుంటున్నాడు.

రెండు రోజులు సరదాగా గడువుదామని నన్ను రమ్మని మరీ మరీ ఉత్తరం రాయడంతో నా కిక




తప్పింది కాదు.

నేను ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో వుంటున్నా వాడి అభ్యర్ధనను మన్నించి వాడున్న ఊరు వచ్చాను.

ప్రయాణ బడలిక వల్ల స్నానం చేశాక ప్రాణానికి హాయిగా అనిపించింది. మూలనున్న సిరిచాప పరిచి పడుకున్నాను. పైన ఫ్యాను గిర్రున తిరుగుతోంది.చల్లని గాలికి కాస్త కునుకు పట్టింది. ఇంతలో ఎవరో వచ్చినట్టు తలుపు దగ్గర అలికిడి అయింది.లేచి చూశాను. " సారు లేరా?" అంటూ నా ఎదురుగా ఓ విద్యార్ధి నిలుచున్నాడు.

"లేదు, బజారుకి వెళ్లాడు, వస్తాడు." అన్నాను ముక్తసరిగా.ఓ గిన్నెలో పెరుగును నా కిచ్చి "ఇది సారు కివ్వండి" అంటూ వెళ్ళి పోయాడు. గిన్నె తీసుకుని లోపల పెట్టాను.

తలుపును వారగా వేసి వచ్చి చాప మీద నడుం వాల్చాను. ఇక నాకు నిద్ర పట్ట లేదు. బ్యాచిలర్ రూం కావటం వల్ల సామాన్లేమీ లేక బోసిగా వుంది. తలుపు మీద తన అభిమాన నటి మాధురీ దీక్షిత్ బొమ్మ అతికించాడు నా మిత్రుడు.

రాజారావు నేను ఇంటర్‌లో క్లాస్‌మేట్స్. చదువులో వాడు నా కన్నా వెనుకే. సరిగ్గా ఇంగ్లీషు పలకటం, రాయటం చేత కాని వాడు నా సాహచర్యం వల్ల చదువులో రాణించగలిగాడు.

అతని కన్నా రెండేళ్ళ ముందుగానే నాకు హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది.

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ, బజారుకెళ్ళిన రాజారావు వచ్చాడు.హోటల్‌కి వెళ్ళి 'చికెన్' తేవటంలో ఆలస్యమయిందంటూనే వంట మొదలు పెట్టాడు. ఆ మాటా ఈమాట చెప్పకునే సరికి వంట రెడీ అయింది.

చికెన్ వేసి నాకు దండిగా వడ్డించాడు. పెరుగన్నం తింటూ చెట్నీ కోసం నేను వెతుకుతుంటే ఇందాక బజారుకెళ్ళి తెచ్చిన బ్యాగ్‌లో నుంచి "ఇదిగో జింజిర్ పికిల్ " అంటూ నా ముందుంచాడు. నా కిష్టమైన జింజిర్ తిందామని మూత తీసి కొంత వేసుకొన్నాను.కొంచం నంజుకున్నానో లేదో మంట నషాలానికి ఎక్కి అబ్బా! అంటూ తల కొట్టుకున్నాను.

ఏమిటన్నట్లు నా వైపు ఆదుర్దాగా చూశాడు." ఇది జింజిర్ చెట్నీ కాదు.జింజిర్ అంటే అల్లం ఇప్పుడు నీవు స్టూడెంట్‌వి కాదు. టీచర్‌వి. నీవెన్నో తెలుసుకొని స్టూడెంట్స్‌కి చెప్ప గలగాలి. నీవే ఇలా తెలుసుకోకుండా చేస్తే ఎలా? ఇక నువ్వు జాగ్రత్తగా వుండాలి సుమా!" అంటూ నే చెబుతూ ఉంటే "అవును నా తప్పను ఎత్తి చూపావు. నిజమైన మిత్రుడంటే నీలాగా ఉండాలి.తప్పలను సరిదిద్దాలి."అంటూ నాకు కృతజ్ఞతలు తెలిపాడు.

–జి.సూర్యనారాయణరావు.